సాక్షి
ఖమ్మం
శనివారం । 28 । జూన్ । 2025



.. ఆధ్యాత్మిక ప్రయాణం

ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ రీజియన్ అధికారులు వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. 8లో



కరెంట్‌తో జర భద్రం!

విద్యుత్ సంబంధిత ప్రమాదాల బారిన పడకుండా రైతులు, వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతమై జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సమస్యలు, అంతరాయాలను అధిగమించేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు ప్రారంభమయ్యాయని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధి 125 ప్రాంతాల్లో, 33 కేవీ లైన్లలో 36 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇవేకాక మరికొన్ని సబ్ స్టేషన్లు, లైన్లతో పాటు 11 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు ఎస్ఈ వివరించారు.

విస్తృతంగా ‘జై భీం, జై బాపు, జై సంవిధాన్’



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కార్యక్రమ కోఆర్డినేటర్లతో సమావేశమైన ఆయన మాట్లాడారు. మండల కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షుల సమన్వయంతో అన్ని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. అలాగే, మండల, గ్రామ కమిటీలు, ఖమ్మంలో డివిజన్ ఇన్‌చార్జిలు, అధ్యక్షుల నియామకం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, వడ్డే నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ల్యాబ్‌లు సీజ్ చేస్తాం..



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ అనుమతి లేకుండా రక్త పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు నిర్వహిస్తే సీజ్ చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.సీతారాం హెచ్చరించారు. సత్తుపల్లిలో శుక్రవారం ల్యాబ్‌ల నిర్వాహకులు, ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ప్రతీ సెంటర్‌లో పరీక్షల వారీగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, అర్హత కలిగిన టెక్నీషియన్లను నియమించి సరైన నివేదికలు ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన అనుమానిత కేసుల వివరాలను పీహెచ్‌సీ అధికారులకు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో గంగారం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.అవినాష్, ఉద్యోగులు వేణుగోపాల్, దుర్గయ్య, వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

మధిర ఆస్పత్రికి రూ.4.02 కోట్లు

మధిర: మధిరలోని 100 పడకల ఆస్పత్రిలో సదుపాయాల కల్పనకు రూ.4.02కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆస్పత్రిలో అదనపు సదుపాయాలు కల్పించేందుకు వైద్య విధాన పరిషత్ ద్వారా ఈ నిధులు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్వ్యూలు సమర్థవంతంగా ఎదుర్కోవడం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో 15రోజుల పాటు ఇచ్చే శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయం కల్పించడమే కాక రవాణా అలవెన్సు చెల్లిస్తారని వెల్లడించారు. ఈమేరకు 21 – 30 ఏళ్ల వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీ ఉండడమే కాక గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.2 లక్షల వార్షిక ఆదాయం కలిగిన ఎంబీసీల్లోని 36 కులాల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని దరఖాస్తుపత్రానికి ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లను జత చేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జూలై 14లోగా సమర్పించాలని బీసీడబ్ల్యూఓ సూచించారు.

ఏజెంట్ల దందా..



జిల్లా రవాణా శాఖ కార్యాలయం

రవాణా శాఖ కార్యాలయాల్లో వాహనదారుల సేవలన్నీ ఆన్‌లైన్ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా... కార్యకలాపాలు మాత్రం ఏజెంట్ల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. నేరుగా వెళ్లే వాహనదారులు పనుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం... తీరా తమ వంతు వచ్చినా కొర్రీలతో అధికారులు తిరస్కరించడం పరిపాటిగా మారింది. దీంతో డబ్బులు పోయినా పని త్వరగా ముగుస్తుండడంతో వాహనదారులు ఏజెంట్లనే ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా వీరి దందా మూడు పూలు.. ఆరు కాయలు అన్న చందంగా వెలుగొందుతోంది. ఏళ్లుగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్ల వ్యవహారం వేళ్లూనుకుపోగా, అధికారుల తనిఖీ సమయాన రెండు, మూడు రోజులు దూరంగా ఉండడం.. ఆపై షరా మామూలుగానే కార్యకలాపాలు సాగిస్తుండడం పరిపాటిగా మారింది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో వీరిదే హవా

- నేరుగా వెళ్తే వాహనదారులు వేచి ఉండాల్సిందే..
- ఏజెంట్ల ద్వారా వెళ్తే సులువుగా పనులు
- తాజాగా ఏసీబీ భయంతో ఆఫీస్‌లకు దూరంగా కొందరు

దళారి లేకపోతే అంతే..

ప్రభుత్వం, రవాణా శాఖ ఉన్నతాధికారుల ప్రకటనలు నమ్మి ఎవరైనా వాహనదారుడు నేరుగా ఆర్టీఓ కార్యాలయానికి వెళ్తే పని పూర్తవడం కష్టమేనని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ మొదలు క్యూలో నిల్చోవడం, ఆన్‌లైన్ పరీక్ష రాయడం వరకు ఇబ్బందులు తప్పవు. అంతేకాక నేరుగా వెళ్లే వాహనదారులు ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం లేదు. ఇవన్నీ పూర్తయినా అవసరమైన కాగితాలన్నీ లేవనో, ఇంకేదైనా సర్టిఫికెట్ తక్కువగా ఉందనో కొర్రీలు పెడుతూ రకరకాల ప్రశ్నలతో ఉద్యోగులు విసిగిస్తారని చెబుతున్నారు. అదే ఏజెంట్ల ద్వారా వెళ్లే వాహనదారుడు నిరక్షరాస్యుడైనా అవలీలగా పరీక్ష గట్టెక్కుతుండడం గమనార్హం. దీంతో 24 సేవలు ఆన్‌లైన్ చేసినా.. ఏజెంట్ల ద్వారానే ఎక్కువగా పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

షరా ‘మామూలే’..

ఆర్టీఓ కార్యాలాయాల్లో ఏజెంట్లు ఉండొద్దని ఉన్నతాధికారులు చెబుతున్నా ఏళ్ల తరబడి వీరి దందాకు తెర పడడం లేదు. అధికారులు వీరి ద్వారా వచ్చే పనులను త్వరగా పూర్తిచేస్తుండడం, వాహనదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న పలువురు కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆర్టీఓ కార్యాలయాల్లో పలుమార్లు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయాన ఏజెంట్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, కొన్ని రోజులపాటు అధికారులు వారిని కార్యాలయాల్లోకి అడుగు పెట్టనివ్వలేదు. ఆ తర్వాత అన్నీ ‘మామూలు’గానే మారిపోయాయి. మళ్లీ ఏజెంట్లు కార్యాలయాలకు రావడం, పనులు చేయించడం యథావిధిగా కొనసాగుతోంది.

ఏసీబీ కలకలం..

హైదరాబాద్ ఉప్పల్‌తోపాటు రాష్ట్రంలోని పలు ఆర్టీఓ కార్యాలయాల్లో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సమాచారం అందడంతో ఖమ్మం, వైరా, సత్తుపల్లి ఆర్టీఓ కార్యాలయాల వద్ద ఏజెంట్లు గురువారం మధ్యాహ్నం నుంచి ముఖం చాటేశారు. శుక్రవారం కూడా కొందరు ఏజెంట్లు మాత్రమే సమీపంలో తచ్చాడుతూ అప్పటికే బుక్ చేసిన స్లాట్ల ప్రకారం వాహనదారుల పనులు జరిగేలా చూశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ తమ ద్వారా వచ్చిన వాహనదారుల వివరాలు చేరవేశారు. కాగా, ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ తనిఖీలు జరుగుతాయనే ప్రచారం కలకలం రేపగా.. అధికారులు, సిబ్బంది కాసేపు హడావిడి చేశారు. అంతేకాక ఏజెంట్లను కార్యాలయంలోనికి రానివ్వకపోగా, తమ షాప్‌లకు ఏజెంట్లు తాళాలు వేయడం గమనార్హం.

అంతా వారిదే రాజ్యం..

జిల్లా కేంద్రమైన ఖమ్మంతో పాటు వైరా, సత్తుపల్లిల్లో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 200 మంది ఏజెంట్లు ఉన్నట్లు అంచనా. వీరిలో పలువురు రవాణా శాఖ కార్యాలయాలకు సమీపాన షాప్‌లు ఏర్పాటుచేసుకోగా, ఇంకొందరు టీ దుకాణాలు, జిరాక్స్ సెంటర్లలో అందుబాటులో ఉంటున్నారు. వాహనదారులకు కొత్త లైసెన్స్, రెన్యువల్, రిజిస్ట్రేషన్, వాహన పన్ను, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇలా ఏది కావాలన్నా వీరిని ఆశ్రయిస్తే త్వరగా పూర్తవుతుంది. క్యూలైన్‌లో నిల్చోవాల్సిన అవసరం లేకుండా అన్ని పనులు చకచకా జరుగుతుండడంతో వాహనదారులు వీరినే ఆశ్రయిస్తున్నారు. అధికారులు కూడా దరఖాస్తులపై ‘కోడ్’ ఆధారంగా ఏజెంట్ల ద్వారా వచ్చినవైతే అభ్యంతరాలు చెప్పకుండా పూర్తిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక

- తహసీల్‌లో రూ.200 చెల్లిస్తే ట్రాక్టర్ లోడ్
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా అవసరమైన ఇసుక సరఫరాపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ఇసుక రీచ్‌ల నిర్వహణ, కూపన్ల జారీపై సమీక్షించారు. లబ్ధిదారులకు ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరమో హౌజింగ్ శాఖ ఏఈ గుర్తించి ఇచ్చే లేఖ ఆధారంగా తహసీల్దార్ కూపన్ జారీ చేయాలని తెలిపారు. ఈ కూపన్ ఆధారంగా మూడు రోజుల్లోగా మండలానికి కేటాయించిన రీచ్ నుంచి ఇసుక తరలించుకోవాలని చెప్పారు. రీచ్‌ల నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించగా లబ్ధిదారులు ప్రతీ ట్రాక్టర్ లోడ్ ఇసుకకు రూ.200 తహసీల్‌లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందులో రూ.100 మహిళా సంఘాలకు, గ్రామపంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.50 చొప్పున అందుతాయని చెప్పారు. కాగా, ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే రీచ్‌ల నుండి ఇసుక తరలింపునకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.

విపత్తుల నిర్వహణ బృందాలకు సామగ్రి

వరద ముప్పు ఎదురైతే సహాయక చర్యల్లో పాల్గొనే బృందాలకు అవసరమైన పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. టార్చ్ లైట్లు, లైఫ్ జాకెట్లు, మైక్ సెట్లు, బోట్లు తదితర సామగ్రి ఏ మేరకు అవసరమో గుర్తించాలని సూచించారు. ప్రతీ 15రోజులకోసారి మండల స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాలు నిర్వహించి ఆపద మిత్రలు, గజ ఈతగాళ్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం చేయాలని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా మైనింగ్ అధికారి సాయినాథ్, ఆర్డీవోలు నర్సింహారావు, ఎల్.రాజేందర్, డీఎల్‌పీఏఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘ముస్కాన్’ విజయవంతమే లక్ష్యం

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్–11ను విజయవంతం చేయడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అధికారులకు సూచించారు. కమిషనరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమైన సీపీ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లల గుర్తింపు, రక్షణ, పునరావాసం కోసం వచ్చేనెల 1నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో తనిఖీ చేయడమే కాక పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. అలాగే, తనిఖీల్లో పట్టుబడిన పిల్లలను తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ద్వారా అందించాలని తెలిపారు. బాలకార్మికులు కనిపిస్తే 100 లేదా 1098కు ఫోన్ చేసేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, డీఈఓ సత్యనారాయణ, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ టి.విష్ణువందన, నోడల్ ఆఫీసర్ డాక్టర్ చందన, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అనిత, ఇన్‌స్పెక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘జల వనరులు’ ఖాళీ!

- ప్రధాన పోస్టులు భర్తీకి నోచుకోక ఇన్‌చార్జ్‌లతో పాలన
- ఫలితంగా ఆయకట్టుకు నీటి సరఫరాపై ప్రభావం
- అభివృద్ధి పనుల పర్యవేక్షణపైనా నీలినీడలు



ఖమ్మంలోని జలవనరుల శాఖ కార్యాలయం

ఖమ్మంఅర్బన్: జిల్లా రైతుల్లో అత్యధికంగా సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగా సాగు చేస్తున్నారు. అయితే, ఈ ప్రాజెక్టుల ద్వారా నీటి పంపిణీలో కీలకంగా వ్యవహరించే జలవనరుల శాఖలో పోస్టులు నెలల తరబడి భర్తీ జరగడం లేదు. కీలక అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం, కొన్నింటిని ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తుండడంతో ప్రాజెక్టుల నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో సుమారు 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ కాల్వల ద్వారా నీరు అందుతుండగా.. చెరువులు, చెక్‌డ్యాములు, వాగులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ఆధారంగా మరో 3లక్షల ఎకరాలకు పైచిలుకు భూమి సాగవుతోంది.

చాలాచోట్ల ఖాళీ కుర్చీలే

ప్రస్తుతం జిల్లాలోని అనేక డివిజన్లలో ఈఈ, డీఈ స్థాయి పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న వారిపై భారం పడుతుండగా పనులు అనుకున్న స్థాయిలో వేగంగా జరగడంలేదు. కల్లూరు డివిజన్ ఈఈ పోస్టులో కొనసాగిన అధికారి మార్చి 31న ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఖాళీగానే ఉంది. ఈ స్థానంలో కనీసం ఇన్‌చార్జ్‌ను కూడా నియమించకపోవడం గమనార్హం. అలాగే ఖమ్మం రూరల్ డివిజన్ డీఈ పోస్టు నాలుగేళ్ల నుంచి ఖాళీగానే ఉండడంతో ప్రస్తుతం నేలకొండపల్లి డీఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాక జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఖమ్మం సీఈ గత డిసెంబర్‌లో రిటైర్ కాగా, నల్లగొండ సీఈ రమేష్‌బాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అంతేకాక అక్టోబర్‌లో ఖమ్మం ఎస్ఈ రిటైర్ అయినా ఇప్పటికీ కొత్త అధికారిని నియమించకుండా పాలేరు ఈఈకి ఆ బాధ్యతలు కట్టబెట్టారు. ఇక మార్చిలో రిటైర్ అయిన డిప్యూటీ సీఈ స్థానంలోనూ ఎవరినీ నియమించకుండా కల్లూరు అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

పర్యవేక్షణ ఎలా?

ఇప్పుడిప్పుడే పంటల సాగు ఊపందుకుంటుండగా సాగునీటి సీజన్ మొదలవుతుంది. ఆయకట్టు ప్రాంతాల్లో నెల రోజుల్లోగా వరి నాట్లు వేయడం ప్రారంభిస్తారు. ఈ తరుణాన పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులపై పర్యవేక్షణ కరువవుతోంది. అంతేకాక పనుల పరిశీలన, కోర్టు కేసులకు హాజరుకావడం కూడా కష్టమవుతోందని సంబంధిత శాఖ అధికారులే చెబుతున్నారు. జిల్లాల సీతారామ ప్రాజెక్టు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులే కాక గత ఏడాది వరదలతో దెబ్బతిన్న కాల్వల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. అయితే, పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లు రెండు చోట్ల పనులను పర్యవేక్షించే పరిస్థితి లేక వేగంగా జరగడం లేదు. ఇకనైనా అధికారుల నియామకంపై ప్రభుత్వం స్పందించకపోతే రానున్న వ్యవసాయ సీజన్‌లో మరిన్ని ఇక్కట్లు ఎదురయ్యే అవకాశముంది.

మిర్చి సాగు తగ్గుతుందా?!



విత్తనాలు నాటడానికి ట్రేలలో కొబ్బరి పొడి నింపుతున్న కూలీలు

- గత ఏడాది దిగుబడితో పాటు తగ్గిన ధర
- ఫలితంగా పత్తి, ఇతర పంటల వైపు రైతుల మొగ్గు
- జిల్లాలోని నర్సరీల్లో ఊపందుకోని నారు పెంపకం



గత ఏడాది ఓ నర్సరీలోని మిరప నారు

మధిర: గత ఏడాది వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి గణనీయంగా పడిపోయింది. వచ్చిన మిర్చికి కూడా సరైన ధర పలకలేదు. అన్ సీజన్‌లోనైనా ధర పెరుగుతుందని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తే ఇప్పుడు కూడా మిర్చిలో ప్రధాన రకమైన తేజాకు క్వింటా ధర రూ.13 వేలు దాటడం లేదు. దీంతో ఈ సీజన్‌లో రైతులు మిర్చి సాగుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో పత్తి, ఇతర పంటల సాగుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. జిల్లాలోని పలు నర్సరీల్లో ఇప్పటివరకు నారు పెంపకం ఊపందుకోకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

గత ఏడాది 288 నర్సరీల్లో...

జిల్లాలో ఉద్యానశాఖ నుంచి అనుమతి తీసుకుని 288 నర్సరీల్లో మిరప నారు పెంపకం చేపట్టారు. అయితే, ఈ ఏడాది అదనంగా ఒక్క నర్సరీ ఏర్పాటుకు కూడా దరఖాస్తు అందకపోగా, పాత వారే రెన్యువల్ చేయించుకున్నారు. అయితే, ఆయా నర్సరీల్లోనూ నారు పెంపకం ఇప్పటివరకు ఊపందుకోకపోవడం గమనార్హం. గత ఏడాది 288 నర్సరీల్లో 67కోట్ల మొక్కలకు సరిపడా నారు పెంచినట్లు అంచనా. ఈ మేరకు జిల్లాలో 60,401 ఎకరాల్లో మిరప పైరు సాగు చేయగా, ఈసారి 50 వేల ఎకరాలు దాటకపోవచ్చని భావిస్తున్నారు.

ఆర్డర్లు కరువు

సాధారణంగా మిరప నాటే సమయానికి 70 శాతం మంది రైతులు నారు కోసం నర్సరీల్లో ఆర్డర్ చేసి అడ్వాన్స్‌గా నగదు చెల్లిస్తారు. ఇందులో కొందరు తమకు కావాల్సిన రకం విత్తనాలను సొంతంగా తీసుకొస్తే మరికొందరు నర్సరీల యజమానులకే ఫలానా రకం కావాలని సూచిస్తారు. అయితే, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు ఐదు శాతం బుకింగ్ కూడా కాలేదని నర్సరీల యజమానులు చెబుతున్నారు. ఫలితంగా జూలై నెల సమీపిస్తున్నా మొక్కల పెంపకం పనులు చాలా నర్సరీల్లో మొదలేకాలేదు. ఇంకొందరు మాత్రం ఆర్డర్లు వస్తాయనే నమ్మకంతో అరకొరగా నారు పెంచుతున్నారు.



ఈయన పేరు వడ్లమూడి శ్రీనివాసరావు. మధిర మండలం మాటూరు క్రాస్ సమీపాన పదిహేనేళ్లుగా భూమి కౌలుకు తీసుకొని మిరప నర్సరీ నిర్వహిస్తున్నాడు. పది ఎకరాల విస్తీర్ణంలో ఏటా 2కోట్ల మేర మిరప మొక్కలు పెంచి అమ్ముతుంటాడు. సీజన్‌కు ముందుగానే 1.20 కోట్ల మిరప మొక్కలకు సంబంధించి బుకింగ్ ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు 5లక్షల బుకింగ్ మాత్రమే నమోదు కావడం గమనార్హం. దీంతో ఏటా పదుల సంఖ్యలో కూలీలకు ఉపాధి కల్పించే శ్రీనివాసరావు ఇప్పుడు కూలీలను నియమించుకోవాలా, వద్దా అన్న సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్నాడు. రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపడం లేదని భావించి మొక్కల పెంపకం తగ్గించినట్లు చెబుతున్నాడు.

పూర్తి స్థాయిలో పని లేదు...



ఏటా మేము పనిచేసే నర్సరీలో రోజుకు వంద మంది కూలీల అవసరం ఉండేది. కానీ ఇప్పుడు 20 మందికి కూడా పని దొరకడం లేదు. మిర్చి సాగు తగ్గుతుందని చెబుతున్నారు. ఇంకా ముందు ఎలా ఉంటుందో చూడాలి.

– పుట్టా మరియమ్మ, మాటూరు

నర్సరీలు తగ్గే అవకాశం..



రైతులు ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తగ్గించే అవకాశం కనిపిస్తోంది. దీంతో నర్సరీల్లో మొక్కల పెంపకం కూడా తగ్గుతుంది. గత ఏడాది ధర తగ్గడం, చీడపీడల భయంతో రైతులు మిర్చి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

– మధుసూదన్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

‘బడిబాట’తో పెరిగిన ప్రవేశాలు

విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం సహకారనగర్/ఏన్కూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలను ఇచ్చిందని విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన బడిబాట, ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సమీక్షించారు. గత ఏడాదితో పోలిస్తే ఒకటో తరగతిలో విద్యార్థుల ప్రవేశాలు 33 శాతం పెరిగాయని సీఎంఓ రాజశేఖర్ వివరించారు. కలెక్టర్, డీఈఓ సత్యనారాయణ సూచనలతో విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామని, తద్వారా 14 స్కూళ్లను పునఃప్రారంభించగా కొత్తగా ఒక పాఠశాల ఏర్పాటుచేశామన్నారు. అనంతరం ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రవేశాలు తగ్గిన హెచ్‌ఎంలతో సమావేశాలు నిర్వహించి కొత్త విద్యార్థుల నమోదుపై దృష్టి సారించాలన్నారు. కాగా, భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు పరికరాలు అందించడంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పాపారావు, ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అతర్వాత ఏన్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, పరిసరాలు, వంటగదిని పరిశీలించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. స్పెషల్ ఆఫీసర్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘అమ్మ’కు ఇల్లు దక్కింది..



ఇంటి వద్ద నాగమ్మతో అధికారులు

కల్లూరురూరల్: తల్లికి అండగా నిల వాల్సిన కుమారులు ఆమెను ఇంటి నుంచి గెంటేయగా.. ఆమె అధికారులను ఆశ్రయించడంతో న్యాయం జరిగింది. కల్లూరు మండలం రావికంపాడుకు చెందిన 85 ఏళ్ల వృద్ధురాలైన తేనే నాగమ్మ భర్త మృతి చెందగా రూ.2వేల పింఛన్, రేషన్ బియ్యంతో జీవనం కొనసాగిస్తోంది. ఆమె ఉంటున్న ఇంటి నుంచి కుమారులు గత నెల 28న గెంటేశారు. దీంతో నిరాశ్రయురాలైన నాగమ్మ ఆర్డీఓ రాజేందర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేసింది. సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ చట్టం ప్రకారం ఆమె ఆరుగురు కుమారులు ప్రతీనెల సంరక్షణ, జీవన భృతి కింద రూ.వెయ్యి చెల్లించడంతో పాటు ఇంటిని అప్పగించాలని ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ పి.సాంబశివుడు, పోలీసులు, ఆర్ఐ సుజాత తదితరులు చెన్నూరు వెళ్లి నాగమ్మకు ఇల్లు అప్పగించడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

క్లుప్తంగా

మోదీ విధానాలతో రైతులకు అన్యాయం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం


సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

చింతకాని: కేంద్రంలో ప్రధాని మోదీ అవలంభిస్తున్న విధానాలతో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మండలంలోని నాగులవంచలో శుక్రవారం రాత్రి జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. రైతులకు నష్టం చేసేలా ఉన్న మోదీ విధానాలను అందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఏదీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కాంగ్రెస్ కార్యకర్తలకే లబ్ధి జరుగుతోందని చెప్పారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఎలాంటి ఫలితం దక్కడం లేదని తెలిపారు. ఈమేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అనగాని ఎల్లయ్య విగ్రహం, అనగాని దుర్గారావు, రౌతు జగన్నాధం చిత్రపటాల వద్ద తమ్మినేని, నాయకులు నివాళులర్పించగా, గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు సామినేని రామారావు, మడుపల్లి గోపాలరావు, రాచబంటి రాము, వత్సవాయి జానికి రాములు, తోటకూరి వెంకటనర్సయ్య, ఆలస్యం రవి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీసీఐగా రాజ్‌గోపాల్


రాజ్‌గోపాల్

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ (సీసీఐ)గా బి.రాజ్‌గోపాల్ నియమితులయ్యారు. గతంలో సీసీఐగా విధులు నిర్వర్తించిన ఎం.డీ.జాఫర్ వరంగల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో రాజ్‌గోపాల్‌ను నియమించారు. ఈమేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు


షాపులో రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల రేషన్ షాప్‌ల్లో సివిల్ సప్లయీస్ అధికారులు శుక్రవారంతనిఖీ నిర్వహించారు. డీటీలు మెచ్చు వెంకటేశ్వర్లు, విజయబాబు, నాగలక్ష్మి, సత్యనారాయణ, ఆర్‌ఐలు కిరణ్, నరేష్, పవన్‌కుమార్ బృందాలుగా విడిపోయి షాప్‌ల్లో తనిఖీలు చేపట్టారు. మూడు నెలలకు సంబంధించి ఒకేసారి సన్నబియ్యం ఇస్తున్న నేపథ్యాన అసలైన లబ్ధిదారులకే పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. ఈనెల 30వ తేదీ వరకు బియ్యం అందజేయాలని, షాపుల్లో పూర్తి వివరాలతో స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు.

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించగా, అపోలో ఫార్మసీలో ఉద్యోగాలకు 97మంది హాజరు కాగా 18 మంది, భారత్ హుండాయ్‌లో ఉద్యోగాలకు ఎంపికైన 25 మందిలో ముగ్గురిని ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఆరుగురు సర్వే ఆఫీసర్ల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న ఆరుగురు సర్వే ఆఫీసర్లను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో ఒక సర్వే ఆఫీసర్, ఐదుగురు జూనియర్ సర్వే ఆఫీసర్లు ఉన్నారు. వీరంతా జూలై 5వ తేదీలోపు కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని అధికారులు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,376	4,000
కందులు	6,100	5,500
అలసంద	6,000	6,000
మిర్చి	13,300	6,000
ఏసీ మిర్చి	13,600	9,500
మిర్చి తాలు	6,500	6,000
పత్తి	7,300	6,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,748

ఆర్టీసీలో ఆధ్యాత్మిక ప్రయాణం

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి నేరుగా బస్సులు లేక రెండు, మూడు చోట్ల మారాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులు తీర్చేలా రాకపోకల కోసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడంతో భక్తులు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా అరుణాచలంలో గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం నడిపిస్తున్న సర్వీసులకు మంచి ఆదరణ లభిస్తుండడంతో ఇంకొన్ని ఆలయాలకు సైతం టూర్ ప్యాకేజీ ఏర్పాటుచేస్తుండడంతో భక్తులు ఆదరిస్తున్నారు. ఇదే సమయాన ఆర్టీసీకి కూడా మెరుగైన ఆదాయం లభిస్తోంది.

– ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి టౌన్

- రీజియన్ నుంచి పుణ్యక్షేత్రాలకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసులు
- గతంలో అరుణాచలానికి బస్సులు
- ఇప్పుడు రీజియన్ నుంచి ఇంకొన్ని క్షేత్రాలకు సైతం..


పుణ్యక్షేత్రాలకు బయలుదేరుతున్న బస్సుల వద్ద సత్తుపల్లి ఆర్టీసీ అధికారులు

ప్రముఖ పుణ్యక్షేత్రాలకు..

ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని డిపోల నుంచి మొదలయ్యే ఈ బస్సులు నిర్దేశిత ప్రాంతాలకు వెళ్తూ, ఆలయాల సందర్శనకు సమయం ఇచ్చి తిరిగి బయలుదేరుతున్నాయి. అన్నవరం, వాడపల్లి, భద్రాచలం, అరుణాచలం వంటి వాటితో పాటు ఇతర ప్రముఖ ఆలయాలను సందర్శించేలా ఈ టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. తద్వారా భక్తులు అలుపు లేకుండా సురక్షితంగా తమ ఆధ్యాత్మిక యాత్ర పూర్తిచేసే అవకాశం లభిస్తోంది.

ఒకటి, రెండు రోజులు...

ఖమ్మం డిపో నుండి అన్నవరం, వాడపల్లి, భద్రాచలం దేవస్థానాలను భక్తులు సందర్శించేలా టూర్ ప్యాకేజీ రూపొందించారు. శుక్రవారం ఉదయం 8గంటలకు బయలుదేరిన ఈ బస్సు అన్నవరానికి చేరుకుని అక్కడ స్వామి దర్శనం పూర్తయ్యాక వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులతో చేరుకుంటుంది. అక్కడ దర్శనం అనంతరం రాత్రి భద్రాచలానికి శనివారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం, ఆతర్వాత కిన్నెరసాని ప్రాజెక్టు సందర్శన తర్వాత ఖమ్మం వస్తుంది. ఇక సత్తుపల్లి డిపో నుంచి మూడు డీలక్స్ సర్వీసులను మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, ద్రాక్షారామం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, పెనుగొండ కన్యకాపరమేశ్వరి ఆలయం, ద్వారకా తిరుమలకు నడిపించారు. మధిర డిపో నుంచి రెండు డీలక్స్ బస్సులతో రామప్ప, భద్రకాళి ఆలయం, పాల్వంచ పెద్దమ్మతల్లి గుడి, భద్రాచలం డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులను అన్నవరం, ద్రాక్షారామం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఒక ప్యాకేజీగా ఏర్పాటుచేశారు. మరో ప్యాకేజీగా యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, హనుమకొండలోని వేయి స్తంభాలగుడికి బస్సులు నడిపారు. ఇక కొత్తగూడెం డిపో నుంచి ఒక డీలక్స్ బస్సు వేములవాడ, కొండగట్టు, హనుమకొండలోని భద్రకాళి ఆలయం, వేయి స్తంభాలగుడికి బయలుదేరింది.

అరుణాచలం గిరిప్రదక్షిణకు..

తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్తున్న భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యాన వచ్చే 10న బుద్ధ పూర్ణిమ సందర్భంగా అక్కడకే వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు ప్రకటించిన అధికారులు ఇందులోనే కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ (శ్రీపురం) దర్శనానికి తీసుకెళ్లేలా ప్యాకేజీ రూపొందించారు.

అరుణాచలం టూర్ షెడ్యూల్ ఇలా..

- జూలై 8న సాయంత్రం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మణుగూరు, సత్తుపల్లి డిపోల నుండి బస్సులు బయలుదేరనున్నాయి.
- ఖమ్మం నుండి రాత్రి 7గంటలకు (సర్వీస్ నంబర్ 64064), మణుగూరు నుండి సాయంత్రం 6గంటలకు (సర్వీసు నంబర్ 55444), సత్తుపల్లి నుండి రాత్రి 7గంటలకు (సర్వీసు నంబర్ 99599) ఈ బస్సులు దేరతాయి.
- ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా మరుసటి రోజు ఉదయం కాణిపాకం, మధ్యాహ్నం 2గంటలకు గోల్డెన్ టెంపుల్ (శ్రీపురం) దర్శనం తర్వాత రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుస్తారు.
- ఆతర్వాత రోజైన 10వ తేదీన తెల్లవారు జామున అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణ, ఆలయంలో దర్శనం అనంతరం అరుణాచలం నుండి బయలుదేరుతారు. జూలై 11న ఆయా డిపోలకు బస్సులు చేరతాయి.
- మణుగూరు డిపో నుంచి బయలుదేరే బస్సు భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా వెళ్తుంది. ఇందులో పెద్దలకు రూ.5,500, పిల్లలకు రూ.2,750గా టికెట్ ధర నిర్ణయించారు.
- సత్తుపల్లి డిపో బస్సు వీ.ఎం.బంజర నుంచి వెళ్లనుండగా పెద్దలకు రూ.5వేలు, పిల్లలకు రూ.2,500 చార్జీ ఉంటుంది.
- ఖమ్మం డిపో బస్సు వైరా, మధిర మీదుగా వెళ్తుంది. ఈ బస్సులో పెద్దలకు రూ.5వేలు, పిల్లలకు రూ.2,500 చార్జీ నిర్ణయించారు.
- టికెట్లు ఇతర వివరాల కోసం ఖమ్మం పరిధి ప్రయాణికులు 99592 25958, మణుగూరు డిపో వారైతే 99592 25963, సత్తుపల్లి డిపోకు సంబంధించి 99592 25962 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రత్యేక టూర్ ప్యాకేజీలు..



ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే ఉమ్మడి జిల్లా భక్తుల కోసం టూర్ ప్యాకేజీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా వెళ్లిరావొచ్చు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి. పూర్తి వివరాలతో డిపో మేనేజర్లను సంప్రదించవచ్చు.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఆర్టీసీ ఖమ్మం రీజియన్

సద్వినియోగం చేసుకోండి..



ప్రయాణికులపై అదనపు భారం లేకుండా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నాం. దర్శనం, అల్పాహారం, భోజనం, ఇతర ఖర్చులు భరించాల్సి ఉంటుంది. బస్సులు ఆలయాల సమీపానికి వెళ్లనున్నందున ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డిపో మేనేజర్, సత్తుపల్లి

కరెంట్‌తో జర భద్రం

సొంతంగా మరమ్మతు చేస్తే ప్రమాదమే..

- సమస్యలు ఎదురైతే సిబ్బందికి సమాచారం ఇవ్వాలి
- సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు


రఘునాథపాలెం : విద్యుత్ రక్షణ చర్యలపై మల్లేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, ఇతర కారణాలతో అక్కడక్కడా విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. ఆ ప్రాంతానికి మేత కోసం వెళ్తున్న మూగజీవాలు మృత్యువాత పడుతుండగా.. రైతులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈనేపథ్యాన విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు, రైతుల్లో అవగాహన కల్పించేలా ఖమ్మం ఎస్ఈ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఆధ్వర్యాన ఉద్యోగులు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా తీగలు తెగిపడినా, ఇతర సమస్యలు ఉన్నా సొంతంగా మరమ్మతు చేయడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఏ సమస్య ఉన్నా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడమో లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...



- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. విద్యుత్ సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912 ద్వారా సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లలో బట్టలు ఆరవేసే వైర్లకు విద్యుత్ వైర్లు తాకితే సరఫరా అయి ప్రమాదం జరిగే అవకాశముంది. అందువల్ల బట్టలు ఆరేసుకునేందుకు ప్లాస్టిక్ తీగలనే ఉపయోగించాలి.
- స్తంభం నుండి ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే వైర్లను రేకులకు తాకకుండా చూడాలి.
- పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా పర్యవేక్షించాలి. ఎక్కడైనా కరెంట్ తెగి పడి ఉంటే సిబ్బందికి సమాచాం ఇవ్వాలి.
- ఇళ్లలో సరైన ఎర్తింగ్ చేయించడమే కాక నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలనే వినియోగించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడకపోవడమే మంచిది.
- పొరపాటున ఎవరైనా షాక్‌కు గురైతే రక్షించాలన్న ఆత్రుతలో నేరుగా తాకొద్దు. సదరు వ్యక్తిని వేరు చేయడానికి కర్ర, ప్లాస్టిక్ వంటివి వాడాలి.
- రైతులు మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వ్‌లు నాణ్యమైనవి అమర్చుకుని, విధిగా ఎర్త్ చేయించాలి.
- ఎవరైనా విద్యుత్ కంచెలు ఏర్పాటుచేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


ర్యాలీలో పాల్గొన్న ఉద్యమకారులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా హామీలు అమలుచేయడం లేదని ఆరోపిస్తూ ఖమ్మంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల సాయం చేయడమే కాక పెన్షన్ మంజూరుచేస్తామని, హెల్త్ కార్డ్‌లు జారీచేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి ఇప్పుడు విస్మరించడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్యతో పాటు అర్వపల్లి విద్యాసాగర్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, జడల వెంకటేశ్వర్లు, గుంతేటి వీరభద్రం, నెల్లూరి అచ్యుతరావు, బచ్చల పద్మాచారి, పాలకురి కృష్ణ, చౌహాన్, నర్సింహారావు, మేకల శ్రీనివాస్, దేవిరెడ్డి విజయ్, గాదె లక్ష్మీనారాయణ, ఎస్.కే.సైదా, సీహెచ్.సీతామహాలక్ష్మి, వరలక్ష్మి, సతీష్, కోటేశ్, బురాన్, అసిఫ్ అహ్మద్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

కారేపల్లి చెరువులో మట్టి తవ్వకాలు


చెరువులో జేసీబీ ద్వారా చేపడుతున్న తవ్వకాలు

కారేపల్లి: కారేపల్లి పెద్ద చెరువులో కొందరు జేసీబీలతో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ తరలిస్తున్నారు. ఈ విషయమై శుక్రవారం ప్రశ్నించగా ఇందిరమ్మ ఇళ్లకోసం మట్టి తరలిస్తున్నామని చెప్పారని స్థానికులు తెలిపారు. అయితే, జేసీబీలతో పెద్ద పెద్ద గోతులు తవ్వుతూ ట్రాక్టర్‌కు రూ.800 చొప్పున వందల ట్రిప్పుల మట్టి తరలించారని ఆరోపించారు. కాగా, పట్టపగలే దందా సాగిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈని ఫోన్‌లో వివరణ కోరగా చెరువు నుంచి మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, తక్షణమే అడ్డుకుంటామని చెప్పారు. కాగా, మట్టి అక్రమ త్రవ్వకాలపై స్థానిక మత్స్య సహకార సంఘం సభ్యులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తురక సాంబ, చింతల సంపత్‌కుమార్, సభ్యులు తురక నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఉద్యోగసేన రాష్ట్ర అధ్యక్షుడిగా బాబూలాల్


నియామకపత్రం అందుకుంటున్న బాబూలాల్

ఏన్కూరు: సేవాలాల్ ఉద్యోగసేన రాష్ట్ర అధ్యక్షుడిగా ఏన్కూరు మండలం శ్రీరాంపురం తండాకు చెందిన భూక్యా బాబూ లాల్‌నాయక్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగసేన రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈమేరకు బాబూలాల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాలోత్ సైదానాయక్, నాయకులు హుస్సేన్‌నాయక్, వెంకన్ననాయక్, కిషన్‌నాయక్, అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

తిరుమలాయపాలెం: మండలంలోని ముజాహిదిపురం పాలేరు ఏటి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బచ్చోడు వద్ద మూడు ట్రాక్టర్ల పట్టుబడగా సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న పీఠాధిపతి ప్రకాష్

తల్లాడ: సరైన అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి సగిలి ప్రకాష్ తెలిపారు. తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాలలో డాన్ బోస్కో దిశ సహకారంతో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డాన్‌బోస్కో దిశ ఆధ్వర్యాన ఖమ్మంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన 27 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా.. 1,700 మంది అభ్యర్థుల్లో ఇంటర్వ్యూల అనంతరం 1,200 మందిని వివిధ పోస్టులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జస్టిన్, క్రీస్తు జ్యోతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.థామస్, లూర్దుమాత విచారణ గురువులు అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు వద్ద ఘర్షణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఓ బెల్ట్‌షాపు వద్ద ఘర్షణలో ఒకరికి దాడి జరిగింది. నేలకొండపల్లికి చెందిన కె.నాగేశ్వరరావు అదే గ్రామానికి చెందిన ఉదయ్ మధ్య పొలం కౌలు విషయంలో వివాదం జరుగుతోంది. శుక్రవారం రాత్రి స్థానిక బెల్ట్‌షాపు వద్ద ఇదే విషయమై గొడవ పడగా నాగేశ్వరరావుపై దాడి చేసినట్లు తెలిసింది. దీంతో ఉదయ్‌తో పాటు ఆయన వెంట మరో వ్యక్తి తనపై దాడిచేశారని నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్త ఆదరించడం లేదని బిడ్డతో బైఠాయింపు

ఖమ్మంరూరల్: ప్రేమ పెళ్లి చేసుకున్న కానిస్టేబుల్ బిడ్డ జన్మించాక తమను పట్టించుకోవడం లేదని ఓ మహిళ ఆయన ఇంటి ఎదుట బైఠాయించింది. మండలంలోని ఎం.వెంకటాయపాలెంకు చెందిన కానిస్టేబుల్ పాపిట్ల మహేష్ కొత్తగూడెంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన ముత్తగూడెంకు చెందిన చెరుకుపల్లి పరిమళను 2024లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి మగబిడ్డ జన్మించాక పట్టించుకోకుండా మహేష్ ముఖం చాటేయడంతో పరిమళ బిడ్డతో సహా శుక్రవారం ఆయన ఇంటి ఎదుట బైఠాయించింది. అత్తమామలు కూడా తమను పట్టించుకోవడంలేదని ఆరోపించింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని పరిమళతో మాట్లాడారు. మహేష్‌ను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా ఆమె దీక్ష విరమించింది.

ఇల్లు రాలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

కాంగ్రెస్ నాయకుడు దూషించాడని మనస్తాపం?

వైరా: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే, ఈ విషయమై ఆరా తీసేందుకు వెళ్లగా కాంగ్రెస్ నాయకుడు దూషించడంతో ఆమె మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. వైరా మున్సిపాలిటీ పరిధి గండగలపాడులో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించారు. అయితే, తొలిదఫా జాబితా ఇటీవల విడుదల చేయగా స్థానికురాలైన కొనకండ్ల ఉషారాణి పేరు లేదు. దీంతో ఆమె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడిని ఆరా తీసేందుకు శుక్రవారం వెళ్లగా ఆయన దూషించినట్లు తెలి సింది.

ఓ పక్క ఇల్లు రాకపోవడం, మరోపక్క నాయకుడు దూషించడంతో మనస్తాపానికి గురైన ఉషారాణి తన ఇంటికి వచ్చి గడువు దాటిన మాత్రలను అధిక మోతాదులో మింగింది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఆమెకు వైరాలోని పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇంకెప్పుడు మారుస్తారు ?

జిల్లా రవాణ శాఖాధికారి కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలతో ఏర్పాటు చేసిన బోర్డును చూస్తే ఎవరైనా సరే అవాక్కవడం ఖాయం. ఈ బోర్డుపై ఉమ్మడి ఏపీలో రవాణా శాఖ మంత్రిగా కొనసాగిన కన్నా లక్ష్మీ నారాయణ ఫొటో ఇప్పటికీ తొలగించలేదు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు దాటి.. మూడో ప్రభుత్వం కొనసాగుతున్నా ఇప్పటికీ బోర్డుపై ఫొటో మార్చకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

